క్లుప్తంగా

ఉప్పరపల్లి హైస్కూల్‌కు ‘సైన్స్‌కిట్లు’

చెన్నారావుపేట : మండలంలోని ఉప్పరపల్లి హైస్కూల్‌కు కేంద్ర ప్రభుత్వ సైన్స్ టెక్నాలజీ శాఖ సహకారంతో సూర్య కిరణ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సైన్స్ కిట్లకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఫ్లోరెన్స్ తెలిపారు. ఈ మేరకు ఆమె గురువారం విలేకరులతో మాట్లాడారు. కలెక్టర్ గోపి, అడిషనల్ కలెక్టర్ శ్రీవత్స, డీఈఓ వాసంతి, జిల్లా సైన్స్ అధికారి కట్ల శ్రీనివాస్‌ల చేతుల మీదుగా సైన్స్ కిట్లను ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు బాలాజీరావు అందుకున్నాడు. గతేడాది సైన్స్ ల్యాబ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పలు సైన్స్ పోటీలలో విద్యార్థులు రాణించడానికి సైన్స్ ఉపాధ్యాయులు తర్ఫీదు ఇస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయిలలో రాణించారని సూచించారు. సైన్స్ కిట్‌లో 23రకాల ప్రయోగాలకు సంబంధించిన సామగ్రి ఉన్నట్లు వెల్లడించారు. విద్యా సంవత్సరానికి మన ఊరు–మన బడిలో అన్ని రకాల వసతులు కల్పిస్తున్నామన్నారు.

వృథాగా.. భగీరథ నీరు



నల్లబెల్లి : మండలంలోని శనిగరం జాతీయ రహదారి పక్కన మిషన్ భగీరథ పైపులైన్ పగిలిపోయింది. దీంతో రెండు రోజులుగా నీరు కొన్ని మీటర్ల ఎత్తు వరకు ఎగిసిపడుతు వృథాగా పోతోంది. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో సురక్షితమైన నీరు వృథాగా పోతోందని స్థానికులు మండిపడుతున్నారు. విషయం తెలుసుకున్న ఆపరేటర్ నీటి సరఫరాను నిలిపివేశాడు. అధికారులు స్పందించి మరమ్మతు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

గీతకార్మికుడికి గాయాలు



ఖానాపురం : తాటిచెట్టు పైనుంచి పడి గీతకార్మికుడికి గాయాలైన సంఘటన మండలంలోని మంగళవారిపేటలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మంగళవారిపేటకు చెందిన తాళ్లపల్లి నర్సయ్య రోజుమాదిరిగానే గ్రామ శివారులో తాటిచెట్టు ఎక్కడానికి వెళ్లాడు. చెట్టు ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు మోకుజారి కిందపడిపోవడంతో నర్సయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు, తోటి కార్మికులు చికిత్స నిమిత్తం నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బియ్యం అందజేత



రాయపర్తి : మండలంలోని గన్నారం గ్రామానికి చెందిన ల్యాదెల్ల నర్సయ్య ఇటీవల మృతిచెందగా గురువారం బాధిత కుటుంబ సభ్యులను సోల్జర్స్ యూత్ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా 25కేజీల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో సోల్జర్స్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు నందనబోయిన సాంబశివ, ఉపాధ్యక్షుడు నందనబోయిన ప్రభుదేవా, కార్యదర్శి వంశీ, సలహాదారుడు నందనబోయిన ప్రవీణ్, సభ్యులు సోమరాజు, రాజు, బద్రి, మహేష్, మునిగాల శ్రీకాంత్, విక్కీ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



వర్ధన్నపేట : పట్టణానికి చెందిన తాపీమేస్త్రీ కొండేటి ఉపేందర్(60) అనారోగ్యంతో గురువారం మృతిచెందాడు. కాగా, ఉపేందర్ మృతదేహాన్ని జిల్లా బీజేపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట నాయకులు బన్న ప్రభాకర్, రాయపురం కుమారస్వామి, పెద్దూరి రాజ్‌కుమార్, ఐత రవికుమార్ తదితరులు ఉన్నారు.

అధికసాంద్రత పత్తి విత్తనాల డబ్బులు చెల్లించాలి

సంగెం : అధిక సాంద్రత పత్తి విత్తనాల డబ్బులు వెంటనే రైతులకు చెల్లించాలని ఆల్ ఇండియా కిసాన్ ఫెడరేషన్ మండల అధ్యక్షుడు గోనే రాంచందర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎకరాకు ఐదు ప్యాకెట్ల పత్తి విత్తనాలను అధిక సాంద్రత పద్ధతిలో మండలంలో 110 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేయిస్తున్నారు. ప్రభుత్వం నగదు చెల్లిస్తుందని, రైతులకు మాయమాటలు చెప్పి కంపెనీకి లాభం చేకూర్చారు. వ్యవసాయ అధికారులు చెప్పిన ప్రకారం రైతుల అకౌంట్లలో డబ్బులు వేయాలని డిమాండ్ చేశారు. లేనిచో రైతులను సమీకరించి ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

నిర్మాణాలు పూర్తయ్యేనా?

- అసంపూర్తిగా ఆరోగ్య ఉపకేంద్రాలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



ధర్మరావుపేటలో అసంపూర్తిగా ఉన్న సబ్‌సెంటర్

ఖానాపురం : గ్రామీణ ప్రజలకు వైద్యంఅందని ద్రాక్షాగానే మిగులుతోంది.. అనారోగ్య సమస్యలతో బాధపడే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో హెల్త్ సబ్‌సెంటర్లను ఏర్పాటు చేస్తోంది. అలాగే సేవలు అందించేందుకు వైద్యులను ప్రభుత్వం నియమించింది.. వైద్యులు సబ్‌సెంటర్లకు వచ్చి సేవలు అందించాలంటే మెరుగైన వసతులు ఉండటానికి ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి హెల్త్ సబ్‌సెంటర్ల భవనాలకు నిధులు మంజూరు చేయించుకొచ్చారు. కానీ అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా భవనాలు అసంపూర్తిగా ఉండి వెలవెలబోతున్నాయి. ఖానాపురం మండలంలోని అశోక్‌నగర్‌లో రూ.20 లక్షలు, ఖానాపురం, ధర్మరావుపేట, బుధరావుపేట, ఖానాపురం గ్రామాల్లో హెల్త్‌సబ్ సెంటర్ల భవనాలకు నిధులు మంజూరు అయ్యాయి. ఒక్కో భవనానికి రూ.16లక్షలతో 2021సంవత్సరంలో నిధులు కేటాయించారు. కాంట్రాక్టర్ దక్కించుకున్న వారు పనులు ప్రారంభించారు. స్లాబ్‌లెవల్ వరకు నిర్మాణాలు చేపట్టారు. అయితే నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని ఆయా గ్రామాల్లోని ప్రజలు బాహాటంగానే ఆరోపిస్తున్నారు. అసంపూర్తిగా పనులు చేపట్టి నిర్మాణాలను కాంట్రాక్టర్లు వదిలేశారు. ప్రజలు ఇదేంటని ప్రశ్నిస్తే నిధులు వస్తేనే పనులు పూర్తి చేస్తామని లేదంటే పనులు చేసేది లేదంటూ నిక్కచ్చిగా చెబుతున్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. మంజూరైన తర్వాత నాలుగు నెలల వ్యవధిలోనే పూర్తి చేయాల్సి ఉంది. ఇవేమీ పట్టించుకోని కాంట్రాక్టర్లు సంవత్సరాలు గడుస్తున్నా పనులు మాత్రం అసంపూర్తిగానే మిగిలిపోయింది. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య పరీక్షలు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేస్తున్న భవనాలు కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో గ్రహణం పట్టుకుంటుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి హెల్త్‌సబ్‌సెంటర్ల నిర్మాణాలు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందడానికి అవకాశం ఉంటుందని ప్రజలు కోరుతున్నారు.

కాంట్రాక్టర్లు స్పందించడం లేదు

నాలుగు గ్రామాల పరిధిలో హెల్త్‌సబ్‌సెంటర్ భవనాలు మంజూరయ్యాయి. నాలుగు నెలల వ్యవధిలోనే పనులు పూర్తి చేయాల్సి ఉంది. నిధులు రావడంలేదని కాంట్రాక్టర్‌లు పనులు నిలిపివేశారు. పనులు చేయాలని ఎన్నిసార్లు సూచించినప్పటికి స్పందించడంలేదు. దీంతో ఉన్నతాధికారులకు విషయాన్ని తెలియజేశాం.

- రత్నాకర్, ఏఈ

అభయాంజనేయస్వామి శోభాయాత్ర



సంగెం: శోభాయాత్రలో పాల్గొన్న ధర్మారెడ్డి



నల్లబెల్లి: పూజలు చేస్తున్న భక్తులు

పాల్గొన్న పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

సంగెం : మండలంలోని తిమ్మాపూర్‌లో పోచమ్మతల్లి, అభయాంజనేయ స్వామి, నవగ్రహ, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవతల యంత్ర, విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం రెండో రోజు వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం హోమాదులు యాగ మండప దేవతాహవనములు, యంత్ర అభిషేకములు అత్యంత వైభవంగా అమ్మవారి, స్వామివారి ఊరేగింపు తదితర పూజలు నిర్వహించారు. మహా అన్నదాన కార్యక్రమాన్ని నూర కోమల–సంపత్‌కుమార్ దంపతులు నిర్వహించారు. అభయాంజనేయస్వామి శోభాయాత్రలో పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పాల్గొని స్వామివారికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, ఎంపీపీ కళావతి, సర్పంచ్ గన్ను శారద, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠాపన

నల్లబెల్లి : మండలంలోని మేడపల్లిలో గురువారం రాజరాజేశ్వర స్వామి, నందీశ్వర, విఘ్నేశ్వర, అభయాంజనేయ స్వామి, నవగ్రహాలను ఘనంగా ప్రతిష్ఠించారు. వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు దర్శించుకున్నారు. అనంతరం మహాన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి, సర్పంచ్ లావుడ్యా తిరుపతి, నాయకులు తాడబోయిన స్వామినాథ్, ఎర్రోజు బిక్షపతి, పెరుమాండ్ల బాబు, గాదం రాజు కుమార్, సంగ పోశాలు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

‘మిషన్ అంత్యోదయ’ పై శిక్షణ



కార్యదర్శులకు శిక్షణ ఇస్తున్న కూచన ప్రకాశ్

నల్లబెల్లి : మిషన్ అంత్యోదయ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పంచాయతీ కార్యదర్శులను మండల పంచాయతీ అధికారి కూచన ప్రకాశ్ ఆదేశించారు. ఈ మేరకు మండలంలోని కన్నారావుపేట రైతు వేదికలో గురువారం మిషన్ అంత్యోదయ కార్యక్రమంపై జీపీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. గ్రామంలో కచ్చితమైన రూపకల్పనలు, మౌళిక వసతుల కల్పన, జీవనోపాధి, ఆరోగ్యం, పారిశుద్ధ్యం, పోషకహారం, మహిళ సాధికారత, ఆర్థిక స్వావలంబన తదితర అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీల్లో చేపట్టిన కార్యక్రమాలు, గ్రామాల్లో సుపరిపాలన, సామాజిక భద్రత, పచ్చదనం, పరిశుభ్రత, ఆదాయ వ్యయాలు, హెల్త్ మేనేజ్‌మెంట్, వివిధ అంశాలను ఆన్‌లైన్‌లో ఎలా నమోదు చేయాలో వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జ్ఞానవేదిక.. లీడ్ గ్రంథాలయం



నర్సంపేట : జ్ఞాన జ్యోతులు వెదజల్లే ఒక గొప్ప వేదికగా నర్సంపేట లీడ్ గ్రంథాలయం నిలుస్తుందని ఓ సంస్థలో అసోసియేట్ డైరెక్టర్‌గా పని చేస్తున్న పెద్ది హరీష్ అన్నారు. లీడ్ గ్రంథాలయం వ్యవస్థాపకులు కాసుల రవి కుమార్ ఆహ్వానం మేరకు గ్రంథాలయాన్ని గురువారం సందర్శించారు. గ్రంథాలయ పాఠకులతో మాట్లాడి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు విద్యార్థుల్లో నిజాయితీ, ధైర్యము, సహనము, వంటి విలువలు పెంపొందించేందుకు కృషి చేయాలని లీడ్ గ్రంథాలయం నిర్వాహకులకు సూచించారు. ఈ సందర్భంగా లీడ్ గ్రంథాలయ వ్యవస్థాపకులు, కవి కాసుల రవికుమార్ దంపతులు, శిల్పా జగదీష్, సదానందం తదితరులు పెద్ది హరీష్‌ను ఘనంగా సన్మానించి మెమొంటో అందించారు.

సుభాష్ చంద్రబోస్ జీవితం స్ఫూర్తిదాయకం



నర్సంపేట: నివాళులర్పిస్తున్న నాయకులు



వర్ధన్నపేట: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

నర్సంపేట : దోపిడీ, పీడిత, ఆర్థిక అణచివేత, వివక్షత పోవాలని పోరాడిన రాయల సుభాష్ చంద్రబోస్ జీవితం విప్లవకారులకు ఆదర్శమని సీపీఐ(ఎంఎల్) ప్రజా పంథా జిల్లా కమిటీ సభ్యుడు చిర్ర సూరి అన్నారు. సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి రాయల సుభాష్ చంద్రబోస్ వర్ధంతిని నర్సంపేటలో గురువారం నిర్వహించారు. సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చిర్ర సూరి మాట్లాడుతూ.. చంద్రబోస్ ఉద్యమ స్ఫూర్తిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు అడ్డూరి రాజు, మనోహర చారి, రాజేందర్, జవహర్‌లాల్, అల్లం నారాయణ, కొడెం సారంగం, భాస్కర్, రమేష్, నవీన్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

‘బీజేపీ’ది ఫాసిస్టు పాలన

వర్ధన్నపేట : బీజేపీ ఫాసిస్టు పాలనలో 73ఏళ్ల తర్వాత భారత రాజ్యాంగంలో ఆమోదించబడ్డ కొద్దిపాటి హక్కులు నేడు ప్రశ్నార్థకంగా మారాయని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా వరంగల్ డివిజన్ కార్యదర్శి బొట్ల రాకేష్ అన్నారు. సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి రవన్న అలియాస్ రాయల సుభాష్ చంద్రబోస్ వర్ధంతి సందర్భంగా మార్చి 10న(నేడు) హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మతోన్మాద ఫాసిజాన్ని వ్యతిరేకిస్తూ సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ గురువారం వర్ధన్నపేటలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాకేష్ మాట్లాడుతూ.. దేశంలో ఎన్నో పోరాటాలతో, త్యాగాలతో ప్రజాస్వామ్యంలో హక్కులు ఆవిష్కరించబడ్డాయన్నారు. రాజరికం పోయి రిపబ్లిక్ ఏర్పడిందన్నారు. నిరుద్యోగం, పేదరికం, ఆకలి చావులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల్లో అసమానతలతో పాటు సకల రంగాల్లో సంక్షోభాలు ఎదురవుతున్నాయన్నారు. మతోన్మాదం, కుల రక్కసి కట్టలు తెంచుకుని ప్రజలపై స్వైర విహారం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పసునూరి రాజు, బి నర్సింహరావు, మైదం పాణి, మోహన్, కట్కూరి వెంకటస్వామి, దేవేందర్, దశరథం, బాలాజీ, వెంకటయ్య, లక్ష్మి, చిన్నస్వామి, ఎల్లయ్య, వెంకటేష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం పరిపాలన దినోత్సవం



స్వయం పరిపాలనలో పాల్గొన్న విద్యార్థులు

ఖానాపురం : మండలంలోని అశోక్‌నగర్ ఉన్నత పాఠశాలలో గురువారం స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మంజులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా సైన్స్ టాలెంట్ టెస్ట్‌కు ఎంపిక

మండలంలోని అశోక్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి జిల్లాస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌కు ఎంపికైనట్లు హెచ్‌ఎం మంజుల తెలిపారు. ఈ మేరకు ఎంపికైన విద్యార్థిని గురువారం పాఠశాలలో ఉపాధ్యాయులు అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న గౌతమ్ ఇటీవల నిర్వహించిన మండల స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా పోటీలకు ఎంపికయ్యాడని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘ఎమ్మెల్సీ పదవికి కవిత రాజీనామా చేయాలి’

ఆత్మకూరు : ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్సీ కవిత తన పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ జిల్లా నాయకుడు పర్వతగిరి రాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. లిక్కర్ స్కాంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న కవిత చట్టాలు, ప్రజాస్వామ్యంపై నమ్మకం ఉంటే తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి నిజాయితీని నిరూపించుకోవాలన్నారు.

కళాకారులకు ఎమ్మెల్యే సన్మానం



సన్మానిస్తున్న ఎమ్మెల్యే పెద్ది దంపతులు

దుగ్గొండి : మండల కేంద్రానికి చెందిన బుడిగ జంగాల కళాకారులైన పస్తం మొగిలయ్య, కొమురమ్మ దంపతులు బలగం చలనచిత్రంలో హృదయాలను కదిలించేలా పాట పాడారు. వీరి ప్రతిభను గుర్తించిన ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి గురువారం రాత్రి నర్సంపేటలోని తన క్యాంపు కార్యాలయానికి పిలిపించుకుని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.మొగిలయ్య అనారోగ్య పరిస్థితుల దృష్ట్యా హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చేర్పించి మెరుగైన చికిత్స అందించి ఆదుకుంటానని, అన్నీ విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం



వర్ధన్నపేట: పారిశుద్ధ్య మహిళా కార్మికులను సన్మానిస్తున్న బాధ్యులు



నర్సంపేట: విజేతలకు బహుమతులు అందిస్తున్న రాజేంద్రప్రసాద్ రెడ్డి

వర్ధన్నపేట : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం వర్ధన్నపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ సీహెచ్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మున్సిపాలిటీలోని పారిశుద్ధ్య మహిళా కార్మికులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సమత మాట్లాడుతూ మహిళా శ్రామిక శక్తికి గుర్తింపునిచ్చిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కార్మికులను గౌరవించుకోవడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. మహిళా కార్మికులు చంద్రమ్మ, కాంత, రాధిక, రజిత, స్వరూప, సీహెచ్.రజిత, రేఖ, ప్రశాంతి ఉన్నారు. అధ్యాపకులు బి.శ్రీనివాస్, డాక్టర్ పి.మాలతిలత, శ్రీధర్‌రెడ్డి, ఎన్.శ్రీనివాసరావు, బి.శ్వేత, సుధారాణి, డాక్టర్ ఎస్.శ్రీనివాస్, కె.జ్యోత్స్న, బి.కృష్ణ, కొమురయ్య, వాసు విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

నర్సంపేట : మహిళలు సామాజిక, రాజకీయ, ఆర్థిక, క్రీడా, కళారంగాల్లో రాణించాలని బాలాజీ విద్యాసంస్థల అధినేత డాక్టర్ రాజేంద్రప్రసాద్ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని బాలాజీ టెక్నో స్కూల్ ఆవరణలో అక్షర స్కూల్, బాలజీ టెక్నో స్కూల్ సంయుక్తంగా విద్యార్థుల తల్లులకు క్రీడోత్సవాలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఆధునిక సమాజంలో మహిళల పాత్రను వివరించారు. బాలాజీ విద్యాసంస్థల కోశాధికారి డాక్టర్ ఎ.వనజ, ప్రిన్సిపాల్స్ పెరుమాండ్ల రాజేంద్రప్రసాద్, జ్యోతి, ఏఓ సురేష్‌లతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు అందని ‘ఉచిత వెలుగు’

- ఉచిత విద్యుత్‌కు చార్జీ వసూలు
- ప్రతి నెల బిల్లులు చెల్లిస్తున్న ఎస్సీ, ఎస్టీలు

నల్లబెల్లి : ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చేయుత నివ్వాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ఆయా కుటుంబాలకు ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోంది. 101యూనిట్ల లోపు విద్యుత్‌ను వినియోగించుకునే ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా అందిస్తుంది. కానీ ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ లోపంతో ఈ పథకంపై అవగాహన కల్పించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఫలితంగా ఈ పథకం లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో అందడంలేదు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యుత్ పథకంపై అవగాహన లేకపోవడంతో ప్రతి నెల బిల్లులు చెల్లిస్తున్నారు. కొందరికి తెలిసిన అధికారుల వేధింపులతో బిల్లులు చెల్లించక తప్పడంలేదని వాపోతున్నారు.

ఉచిత విద్యుత్ పరిధిలోకి రాని ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు ఉన్నాయి. నర్సంపేట నియోజకవర్గంలో 10,643 ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు విద్యుత్‌ను వినియోగిస్తున్నారు. వీరికి ఉచిత విద్యుత్ పథకం వర్తించాలంటే అధికారులకు వినియోగదారులు కులధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి. కానీ విద్యుత్ వినియోగిస్తున్న వారిలో ఈ పథకంపై పూర్తి అవగాహన లేకపోవడంతో సుమారు 6 వేల మంది నేటికి కుల ధ్రువీకరణ పత్రాలు అందించలేదని అధికారులే వివరిస్తున్నారు. అంతే కాకుండా విద్యుత్ సర్వీస్ ఉన్న కుటుంబ యజమాని మృతి చెందిన సందర్భంలో ప్రస్తుతం వారి వారసుల కులధ్రువీకరణ పత్రాలను సమర్పిస్తే సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ కారణాలతో వీరు ఉచిత విద్యుత్ పథకానికి అర్హత పొందడం లేదు.



ఈ ఫొటోలో కనిపిస్తుంది నల్లబెల్లి మండల కేంద్రానికి చెందిన కొండి సదయ్య. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఇతనికి ప్రభుత్వం ప్రతి నెల 101యూనిట్ల వరకు విద్యుత్‌ను ఉచితంగా ప్రభుత్వం సరఫరా చేస్తోంది. బిల్లు చెల్లించకుంటే కనెక్షన్ తొలగిస్తామని అధికారులు వేధింపులకు గురిచేస్తుండడంతో రెగ్యులర్‌గా బిల్లు చెల్లిస్తున్నాడు. ప్రతి నెల సరాసరి 70యూనిట్ల లోపు విద్యుత్ వాడుకుంటు రెగ్యులర్‌గా బిల్లు చెల్లించినప్పటికి.. గత నెలలో 669 యూనిట్లు విద్యుత్‌ను వినియోగించినట్లు పేర్కొంటు రూ.5,224 బిల్లు చేతిలో పెట్టారు. రెగ్యులర్‌గా ఉచిత విద్యుత్‌ను అందించడంతో పాటు అదనంగా వచ్చిన బిల్లును సరిచేయాల్సిన అవసరం అధికారులపై ఉంది.



విద్యుత్ సిబ్బందితో చర్చిస్తున్న సదానందం

వందలోపు ఉంటే చెల్లించొద్దు

101 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించుకునే ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్‌ను సరఫరా చేస్తోంది. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచిత విద్యుత్‌ను అందిస్తుండగా, దరఖాస్తు చేసుకోని కుటుంబాలకు ఆ శాఖ అవగాహన కల్పిస్తోంది.మీసేవా ద్వారా పొందిన కులధ్రువీకరణ పత్రాలను విద్యుత్ శాఖ కార్యాలయంలో అందిస్తే వారికి ఈ సబ్సిడీ వర్తింపజేస్తాం. వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నాం. మీటర్ లేకుండా విద్యుత్ వినియోగిస్తే చర్యలు తప్పవు.

- సదానందం, డీఈ, ఎన్పీడీసీఎల్ నర్సంపేట


షాపింగ్ కాంప్లెక్స్ వేలంలో పాల్గొనాలి

నెక్కొండ : నెక్కొండ గ్రామ పంచాయతీకి సంబంధించిన షాపింగ్ కాంప్లెక్స్ రెండు గదులు కిరాయికి ఇచ్చేందుకు ఈనెల 17న వేలం నిర్వహిస్తున్నామని పంచాయతీ కార్యదర్శి సదానందం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 1-71/1, 1-71/2 గదులను 2023-24 ఆర్థిక సంవత్సరానికి కిరాయికి ఇచ్చేందుకు వేలం నిర్వహిస్తున్నామని, వేలంలో పాల్గొనే ఆసక్తి కలిగిన వారు రూ.500 రిజిస్ట్రేషన్ ఫీజుతో పాటు ఒక గదికి రూ.2 వేల చొప్పున గ్రామ పంచాయతీ కార్యదర్శి, జీపీ నెక్కొండ పేర డీడీ ద్వారా డిపాజిట్ చెల్లించాలని తెలిపారు. ఈ డీడీలను ఈ నెల 16వ తేదీ సాయంత్రం 5గంటల వరకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్వయంగా వచ్చి సమర్పించాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు గ్రామ పంచాయతీ కార్యాలయ పని వేళలో సంప్రదించాలని సూచించారు.

నేడు అంగడివేలం

రాయపర్తి : మండలకేంద్రంలోని గ్రామపంచాయతీలో అంగడివేలం పాట నేడు(శుక్రవారం) నిర్వహించనున్నట్లు సర్పంచ్ గారె నర్సయ్య, పంచాయతీ కార్యదర్శి గుగులోత్ అశోక్‌నాయక్ తెలిపారు. గురువారం సంబంధిత కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేలంలో పాల్గొనే ఔత్సాహికులు రూ.50వేల డిపాజిట్ చేయలన్నారు. వేలంలో పాల్గొనే వారి కుటుంబ సభ్యులు గ్రామపంచాయతీకి ఎలాంటి బాకీ ఉండకూడదన్నారు. వేలం పాటకు ముందు సీల్డ్ టెండర్లు దాఖలు చేయాలని, పాట పూర్తయిన తర్వాత సీల్డ్ కవర్లు ఓపెన్ చేయనున్నట్లు వారు తెలిపారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక



ఐనవోలు : నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌నకు(ఎన్‌ఎంఎంఎస్) మండలం నుంచి 8మంది విద్యార్థులు ఎంపికయ్యారు. గురువారం విడుదలైన ఎన్‌ఎంఎంఎస్ ఫలితాల్లో ఒంటిమామిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 7గురు విద్యార్థులు ఎస్.శివాణి, ఆర్.కౌశిక్, జి.రితీష్, ఆర్.వరుణ్, పి.స్వాతి ముత్యం, ఎం.పార్థు, ఎండీ రిజ్వానా ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు ఆరోగ్యమ్మ తెలిపారు. అలాగే ఐనవోలు జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన రాయపురం అశోక్ తేజ ఎంపికయ్యారు. విద్యార్థులకు 2023-24 విద్యా సంవత్సరం నుంచి వరుసగా నాలుగేళ్ల పాటు రూ.12 వేలు స్కాలర్‌షిప్ అందజేయబడుతుంది. కాగా ఎస్‌ఎంసీ చైర్మన్ పొన్నాల రాజు, ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు విద్యార్థులను అభినందించారు.